

ఎమ్మెల్యే తలసానికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పద్మారావునగర్ సంక్షేమ సంఘం నాయకులు, కార్పొరేటర్ హేమలత



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

# భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

## మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్/బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 26: ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత పాలక మండలిపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని తెలిపారు. గణేష్ దేవాలయాన్ని కూడా ఎంతో అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించిందని వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు మోహన్, వినోద్, అశోక్ పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

పద్మారావునగర్‌లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కార్యదర్శి చక్రధర్ యాదవ్, జీకే.నాయుడు, కృష్ణారావు, బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ హేమలత, బీఆర్ఎస్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్‌లు ఆయనను కలిశారు. హ్యాట్రిక్ విజయం సాధించిన తలసానికి అభినందనలు తెలిపారు.

# ‘కార్యకర్తల సమష్టి కృషితోనే.. ఎన్నికల్లో విజయం’



ఆరె మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన తలసానికి స్వాగతం పలుకుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,డిసెంబర్ 26: కార్యకర్తల సమష్టి కృషితో ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించగలిగామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆరె మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడంతో పాటు ఎన్నికల సమయంలో కార్యకర్తలు ఎంతో కష్టపడి తనను మరోసారి గెలిపించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు, సనత్‌నగర్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు వనం సంగీత యాదవ్, మన్నె కవితారెడ్డి , పలువురు నేతలు పాల్గొన్నారు.

# ‘ప్రజా పాలన’కు ఏర్పాట్లు పూర్తి

## అధికారులతో సమీక్షించిన కమిషనర్ రోనాల్డ్ రాస్




జీహెచ్ఎంసీతో పాటు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రాస్

బంజారాహిల్స్,డిసెంబర్ 26: జీహెచ్ఎంసీ సర్కిల్ 18 పరిధిలో ‘ప్రజా పాలన’ కార్యక్రమం కోసం ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కోసం ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు జీహెచ్ఎంసీ సర్కిల్-18లో చేపట్టనున్న ‘ప్రజా పాలన’ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రేతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ. జలమండలి, రెవెన్యూ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా బస్తీలు, లోకాలిటీల వారీగా అధికారులు పర్యటించడంతో పాటు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సర్కిల్ పరిధిలో 16 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, సర్కిల్‌కు ప్రత్యేక అధికారిగా దయానంద్‌ను నియమించామని పేర్కొన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఒక్కో కేంద్రంలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఎనిమిది మంది సిబ్బందితో పాటు నోడల్ అధికారి దరఖాస్తుల స్వీకరణ పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం నోడల్ అధికారిని నియమించారు. వివిధ పథకాల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌తో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. మహిళలకు ప్రత్యేకంగా రెండు కౌంటర్లను ఏర్పాట్లు చేయనున్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేస్తూ దరఖాస్తుల స్వీకరణ నిర్వహించాల్సి ఉంటుంది.

### సర్కిల్-18 పరిధిలో ప్రజా పాలన కేంద్రాలు ..

సర్కిల్-18 పరిధిలో ప్రజాపాలన కార్యక్రమం కోసం మొత్తం 16 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

- బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ మేనేజర్స్ ట్రైనింగ్ సెంటర్, ఉదయ్ నగర్ కమ్యూనిటీహాల్, ఎన్‌బీనగర్ కమ్యూనిటీహాల్, ప్రేమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేస్తున్నారు.
- వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 7లోని మీ సేవ కేంద్రం, దేవరకొండ బస్తీ కమ్యూనిటీ హాల్, సుఖ్‌దేవ్‌నగర్ కమ్యూనిటీహాల్, దూద్ కానా బస్తీ కమ్యూనిటీహాల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.
- జూబ్లీహిల్స్ డివిజన్‌లో జూబ్లీహిల్స్‌లోని వార్డు కార్యాలయం, బీజేఆర్‌నగర్‌లో కమ్యూనిటీహాల్, జవహర్ కాలనీలో కమ్యూనిటీ హాల్, గౌతమ్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో అధికారులు అందుబాటులో ఉంటారు.
- షేక్‌పేట డివిజన్ పరిధిలోని షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్, విరాటనగర్‌లో కమ్యూనిటీ హాల్,బీజేఆర్‌నగర్‌లో కమ్యూనిటీహాల్, ఇందిరాగాంధీ కమ్యూనిటీహాల్ తదితర ప్రాంతాల్లో తొలిదశలో ప్రజా పాలన కొనసాగుతుందని జోనల్ కమిషనర్ తెలిపారు.

# పంజాగుట్ట సీఐకి అస్వస్థత

ఖైరతాబాద్, డిసెంబర్ 26 : పంజాగుట్ట సీఐ దుర్గారావు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే అతడిని బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రజాభవన్ వద్ద బారికేడ్‌ను కారు ఢీకొట్టిన కేసులో చోటు చేసుకున్న పరిణామాలపై వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ సీఐని పిలిపించి ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ప్రజాభవన్ వద్ద బారికేడ్‌ను ఢీకొట్టిన కేసులో నిందితుడిని గుర్తించామని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్ మీడియాకు తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు తన ఇంట్లో పనిచేస్తున్న మరో వ్యక్తి చేసినట్లు చెప్పించాడని, తమ విచారణలో ఉద్దేశపూర్వకంగా ఇలా చేశాడని డీసీపీ తెలిపారు. త్వరలోనే డ్రైవింగ్ చేసిన వ్యక్తితో పాటు అందులో ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

# డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి

## కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్

కాచిగూడ,డిసెంబర్ 26: డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. బర్కత్‌పుర చౌరస్తాలో కొన్ని రోజులుగా డ్రైనేజీ పైపు కుంగిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ కుంగిపోయిన డ్రైనేజీ పైపును జలమండలి సిబ్బందితో బాగుచేయించారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌యాదవ్,సుభాశ్‌పటేల్,మధన్‌యాదవ్, సంతోశ్, భీంరాజ్, రవియాదవ్, రాము, తదితరులు పాల్గొన్నారు.





